సొంత దేశంలో పాక్‌కు మరో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. సౌత్ వజిరిస్థాన్‌లో నిషేధిత తెహ్రీక్-ఈ-తాలిబన్ (టీటీపీ) తీవ్రవాదులు జరిపిన దాడిలో 25 మంది పాకిస్థాన్ సైనికులు మృతి చెందారు.

పుష్కలంగా చమురు నిల్వలు.. ఆందోళన వద్దు

చమురు సంస్థల ప్రకటన

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌తో యుద్ధ వాతావరణం నెలకొనడంతో దేశంలోని చమురు, గ్యాస్ నిల్వలపై కేంద్రం స్పష్టతనిచ్చింది. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చమురు కంపెనీలు పేర్కొన్నాయి. అవసరం లేకున్నా కంగారుపడి వాటిని కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) వేర్వేరు ప్రకటనల్లో తెలిపాయి.

ఆహార నిల్వలపై వ్యాపారులకు హెచ్చరిక

ప్రభుత్వం వద్ద తగినన్ని నిల్వలున్నాయన్న కేంద్రమంత్రి

న్యూఢిల్లీ: వ్యాపారులు అత్యవసర ఆహార పదార్థాల నిల్వలు పెంచుకుంటున్నట్టు వార్తలు రావడంతో కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి స్పందించారు. అత్యవసర ఆహార పదార్థాలను సేకరించి నిల్వలు పెంచుకుంటున్న ట్రేడర్లు, హోల్‌సేల్ వ్యాపారులు, రిటైలర్లను హెచ్చరించారు. ప్రభుత్వం వద్ద చాలినన్ని నిల్వలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఎవరైనా వీటిని పెద్ద ఎత్తున సేకరించడం కానీ, నిల్వ చేయడం కానీ చేస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఏటీఎంల మూత ఉత్తదే

సేవలు యథావిధిగా నడుస్తున్నాయన్న బ్యాంకులు

న్యూఢిల్లీ: ఇండియా-పాక్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ సోషల్ మీడియాలో ఫేక్ వార్తలు విచ్చలవిడిగా హల్‌చల్ చేస్తున్నాయి. అందులో ఏటీఎంలు మూతపడబోతున్నాయన్న వార్త ఒకటి. దీనిపై భారతీయ స్టేట్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, సింధ్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా పలు బ్యాంకులు స్పందించాయి. ఆ ప్రచారంలో నిజం లేదని, ఏటీఎంలు, సీడీఎంలు/ఎడీడబ్ల్యూఎంలు యథావిధిగా పనిచేస్తున్నాయని తెలిపాయి. డిజిటల్ సర్వీసులు కూడా ఎలాంటి విఘాతం లేకుండా కొనసాగుతున్నాయని స్పష్టం చేశాయి.

సీఏ ఫైనల్ ఎగ్జామ్స్ వాయిదా

భద్రతా పరిస్థితుల దృష్ట్యా ఐసీఏఐ నిర్ణయం

న్యూఢిల్లీ: ఈ నెల 9 నుంచి 14 మధ్య జరగాల్సిన సీఏ పరీక్షలను చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) వాయిదా వేసింది. ఫైనల్, ఇంటర్మీడియెట్, పోస్ట్ క్వాలిఫికేషన్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు శుక్రవారం ప్రకటించింది. దేశంలో భద్రతా పరమైన ఉద్రిక్తతలు నెలకొనడంతో పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు తెలిపింది. త్వరలోనే మళ్లీ తేదీలను ప్రకటిస్తామని పేర్కొంది. మొత్తం 55,666 మంది విద్యార్థులు ఫైనల్ పరీక్షలకు, 1,02,378 మంది ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది.

డిమాండ్ వల్లే బాస్మతి బియ్యం ధరల పెరుగుదల

యుద్ధం కారణం కాదు ఏఐఆర్ఈఏ వెల్లడి

న్యూఢిల్లీ: బాస్మతి బియ్యం ధరలు అమాంతం పెరగడంతో కొందరు దానిని భారత్-పాక్ ఉద్రిక్తతలకు ముడిపెడుతూ ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అఖిల భారత బియ్యం ఎగుమతుల సంఘం (ఏఐఆర్ఈఏ) కీలక ప్రకటన చేసింది. బాస్మతి బియ్యం ధరల పెంపునకు, భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలకు సంబంధం లేదని అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్ గోయెల్ తెలిపారు. డిమాండ్ కారణంగానే బియ్యం ధరలు పెరిగాయని, దానికి ప్రస్తుత ఉద్రిక్తతలకు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు.

'ఆకాశ్'మే హద్దు

పాక్ డ్రోన్లను తుత్తునియలు చేసిన స్వదేశీ రక్షణ వ్యవస్థ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లోని 36 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని గురువారం రాత్రి పాకిస్థాన్ 300 నుంచి 400 డ్రోన్లతో దాడులకు తెగబడింది. అయితే, దూసుకొస్తున్న ఈ డ్రోన్లను గాలిలో ఉండగానే తుత్తునియలు చేయడంలో ఆకాశ్ సర్ఫేస్ టూ ఎయిర్ మిసైల్ డిఫెన్స్ సిస్టమ్ కీలక పాత్ర పోషించింది. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఈ రక్షణ వ్యవస్థ గురించి ఇప్పుడు అంతటా చర్చ మొదలైంది.

ఆకాశ్-ప్రత్యేకతలు

- **పేరు:** ఆకాశ్ సర్ఫేస్ టూ ఎయిర్ మిసైల్ డిఫెన్స్ సిస్టమ్
- **అభివృద్ధి చేసింది:** స్వదేశీ పరిజ్ఞానంతో భారత్
- **పరిధి:** 4.5 కిలోమీటర్ల నుంచి 25 కిలోమీటర్లు
- **క్షిపణి వేగం:** గంటకు 4,320 కిలోమీటర్లు (సూపర్ సోనిక్ (మాక్ 2.5-3.5))
- **లాంచింగ్ ప్లాట్‌ఫామ్:** మొబైల్ లాంచర్లు (ట్రక్కు లేదా వాహనాలు)
- **వేటిని కూల్చగలదు?:** డ్రోన్లు, ఫైటర్ జెట్లు, హెలికాప్టర్లు, క్రూయిజ్ క్షిపణులు
- **స్పెషాలిటీ:** ఏక కాలంలో ఏ దిశ నుంచి వచ్చిన బహుళ డ్రోన్లనైనా కచ్చితత్వంతో కూల్చగలదు.
- **వార్‌హెడ్ బరువు:** సుమారు 60 కిలోలు
- **రాడార్ రకం:** రాజేంద్ర రాడార్ (లక్ష్యాల కూల్చివేత, గుర్తింపు)

ఏటీజీఎంతో పాక్ బంకర్లు భస్మీపటలం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): సరిహద్దుల్లో శతఘ్నులు, భారీ మెషిన్ గన్స్‌తో దాడులకు పాల్పడుతున్న పాక్ రేంజర్లకు భారత్‌కు చెందిన యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్ (ఏటీజీఎం) చుక్కలు చూపిస్తున్నది. దాడులు చేసి నక్కేందుకు పాక్ రేంజర్లు ఏర్పాటు చేసుకొన్న బంకర్లను ఏటీజీఎం భస్మీపటలం చేస్తున్నది.

ఏటీజీఎం-ప్రత్యేకతలు

- **పేరు:** ఏటీజీఎం
- **ఎందుకు వాడుతారు?:** ఆయుధాలు కలిగిన వాహనాలు, బంకర్లు, యుద్ధ ట్యాంకులను నాశనం చేయడానికి..
- **పరిధి:** 1.5 కిలోమీటర్ల నుంచి 5 కిలోమీటర్ల వరకు
- **ఎలా పనిచేస్తుంది?:** రెండు వార్‌హెడ్స్ ఉంటాయి. తొలి దాడిలో శత్రు ట్యాంక్ బయటి కవచం నాశనమౌతుంది. రెండో దాడిలో ట్యాంక్ ధ్వంసమవుతుంది.
- **ఎలా ప్రయోగించాలి?:** భుజం మీద నుంచి లేదా ట్రైపోడ్, వాహనాలపై అమర్చి వాడొచ్చు.
- **ప్రత్యేకత:** ఒక్కసారి బంకర్ లేదా టార్గెట్‌ను లాక్ చేస్తే.. దానంతట అదే లక్ష్యాన్ని వెంటాడి ఛేదిస్తుంది.

ఢిల్లీ తెలంగాణ భవన్‌లో కంట్రోల్‌రూమ్

24 గంటలపాటు నిరంతర సేవలు..

తెలంగాణవాసుల కోసం ఏర్పాటు

హైదరాబాద్, మే9 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ సరిహద్దులో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్టు భవన్ రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తెలిపారు. సరిహద్దు రాష్ట్రాల్లో నివసిస్తున్న లేదా చిక్కుకున్న తెలంగాణవాసులకు సకాలంలో సహాయం, సమాచారం, సేవలను అందించేందుకు దీనిని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. కంట్రోల్‌రూమ్ నిరంతరం పనిచేస్తుందని, నిరంతరాయంగా సేవలను అందిస్తుందని తెలిపారు. సహాయం కావాల్సిన వారు కింది నంబర్లలో సంప్రదించాలని గౌరవ్ ఉప్పల్ సూచించారు.

కంట్రోల్ రూమ్ అధికారులు, నంబర్ల వివరాలు

పేరు	హోదా	ఫోన్ నంబర్
వందన	రెసిడెంట్ కమిషనర్ ప్రైవేట్ సెక్రటరీ & లైజన్ హెడ్	9871999044
హైదర్ అలీ నఖ్వీ	రెసిడెంట్ కమిషనర్ వ్యక్తిగత సహాయకుడు	9971387500
జీ రక్షిత్‌నాయక్	లైజన్ ఆఫీసర్	9643723157
సీహెచ్ చక్రవర్తి	పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్	9949351270
ల్యాండ్ లైన్		011-23380556

75 నిమిషాల ముందే చెక్‌ఇన్ క్లోజ్

3 గంటల ముందే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోవాలి

న్యూఢిల్లీ, మే 9: పాకిస్థాన్‌తో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రయాణికులకు విమానయాన సంస్థలు కీలక సూచనలు చేశాయి. విమానాలు బయల్దేరే సమయానికి 3 గంటలు ముందే విమానాశ్రయాలకు రావాలని ప్రయాణికులను కోరాయి. విమానం బయల్దేరడానికి 75 నిమిషాల ముందు చెక్‌ఇన్‌ను క్లోజ్ చేయనున్నట్టు తెలిపాయి. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) ఆదేశాల నేపథ్యంలో సూచనలు చేస్తున్నట్టు పలు విమానయాన సంస్థలు వెల్లడించాయి.

మా ప్రధాని పిరికిపంద

- **పాక్ ప్రధానిపై ఆ దేశ ఎంపీ సంచలన వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ, మే 9 : పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఓ పిరికిపంద అని పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్(పీటీఐ) ఎంపీ షాహిద్ అహ్మద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పీఎం మోదీ పేరును సైతం మా ప్రధాని ఉచ్చరించడం లేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. పాకిస్తాన్ భారత్‌పై డ్రోన్ల దాడికి తెగబడిన తర్వాత శుక్రవారం పాకిస్థాన్ పార్లమెంట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు ఎన్డీటీవీ కథనం తెలిపింది. పాకిస్థాన్‌కు చెందిన ప్రజాప్రతినిధి ఆ దేశ ప్రధానిపై చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పాక్ ప్రధానిపై ఇటీవల సొంత దేశంలో తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారత్.. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడి అనంతరం షెహబాజ్ షరీఫ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ ప్రెస్ కాన్ఫరెన్స్‌పై పాక్ ప్రజలు తీవ్రస్థాయిలో తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

పాక్ పక్కలో బలూచ్ బల్లెం

- **స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్న వేర్పాటువాదులు**
- **ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలని డిమాండ్**
- **బీఎల్ఏ వరుస దాడులతో పాక్ సైన్యం ఉక్కిరిబిక్కిరి**
- **ఇప్పటికే కీలక ప్రాంతాలు బీఎల్ఏ చేతిలోకి**

బలూచిస్థాన్‌కు స్వాతంత్ర్యం ప్రకటిస్తున్న బీఎల్ఏ, బలూచిస్థాన్‌లో పాక్ జెండాలను తొలగించి బలూచిస్థాన్ జెండాలను ఎగురవేస్తున్న వేర్పాటువాదులు

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): భారత్‌తో యుద్ధానికి దిగిన పాకిస్థాన్‌కు బలూచిస్థాన్ పక్కలో బల్లెంలా మారింది. బలూచిస్థాన్‌ను స్వతంత్ర్య దేశంగా ప్రకటించుకునే దిశగా బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ' (బీఎల్ఏ), ఇతర వేర్పాటువాద గ్రూప్‌లు అడుగులు వేస్తున్నాయి. తాము స్వాతంత్ర్యం పొందామని బలూచిస్థాన్‌ను ప్రత్యేక దేశంగా గుర్తించాలని ఐక్యరాజ్యసమితి, ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశాయి. బలూచిస్థాన్‌లో వరుస దాడులతో పాక్ సైన్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. భారత్‌పై మిస్సైళ్లు, డ్రోన్లతో దాడి చేసేందుకు పాక్ సైన్యం ప్రణాళికలు రచిస్తుంటే.. బలూచిస్థాన్‌లో కీలక ప్రాంతాలపై బీఎల్ఏ పట్టు సాధిస్తున్నది. బాంబుదాడులు, బుల్లెట్లతో విరుచుకుపడుతూ అక్కడ గస్తీ కాస్తున్న పాక్ సైన్యానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. మొత్తంగా ఇటు తూర్పు ప్రాంతమైన భారత్ నుంచి, అటు పశ్చిమ ప్రాంతమైన బలూచిస్థాన్ నుంచి జరుగుతున్న దాడులతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. ప్రస్తుతం పాకిస్థాన్ సైనిక సంపత్తి, ఆర్థిక పరిస్థితి, అంతర్జాతీయ సంబంధాలు వంటి అంశాలను బేరీజు వేస్తే.. అతి త్వరలో పాకిస్థాన్ రెండు ముక్కలు కావొచ్చని, బలూచిస్థాన్ ప్రత్యేక దేశంగా అవతరించే అవకాశం ఉన్నదని అంతర్జాతీయ నిపుణులు పేర్కొంటున్నారు.

రోజురోజుకూ పెరుగుతున్న దాడులు..

బలూచిస్థాన్‌లో బీఎల్ఏ, రెబల్స్ గ్రూప్స్ కలిసి కొంత కాలంగా పాక్ సైన్యంపై, ప్రభుత్వ ఆస్తులపై వరుసగా దాడులు చేస్తూ ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం బలూచిస్థాన్‌లోని అనేక ప్రాంతాల్లో బీఎల్ఏ, రెబల్స్ దాడులు చేసినట్టు అక్కడి మీడియా సంస్థలు తెలిపాయి. బలూచిస్థాన్ రాజధాని క్వెట్టాలో గురువారం నాలుగు చోట్ల దాడులు జరిగినట్టు స్థానిక రేడియో జుంబేష్ ఇంగ్లిష్ తెలిపింది. క్వెట్టా వ్యాప్తంగా పేలుళ్లు, తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించినట్టు వెల్లడించింది. 'మేం క్వెట్టాతోపాటు బలూచిస్థాన్ వ్యాప్తంగా అనేక సైనిక పోస్టులపై దాడులు చేసి స్వాధీనం చేసుకున్నాం' అని బీఎల్ఏ తెలిపింది. కెచ్, మస్తంగ్, కచి ప్రాంతాల్లో పాక్ సైన్యంపై ఆరు దాడులు చేసినట్టు వెల్లడించింది. దాడులకు సంబంధించిన వీడియోలను వేర్పాటువాదులు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బీఎల్ఏ అధికార ప్రతినిధి జియాంద్ బలూచ్ తెలిపిన వివరాల మేరకు బలూచిస్థాన్‌కు చెందిన జర్నలిస్ట్ బహోట్ బలూచ్ గురువారం ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టారు. దీని ప్రకారం.. బలూచిస్థాన్‌కు కెచ్ జిల్లాలోని దస్తక్ ప్రాంతంలో బీఎల్ఏ రిమోట్ కంట్రోల్ ఐఈడీని పేల్చడంతో బాంబు డిస్పోజబుల్ స్క్వాడ్‌కు చెందిన ఒక సైనికుడు అక్కడికక్కడే మరణించాడు. అదే జిల్లాలోని కెట్గాన్ ప్రాంతంలో పాకిస్థాన్ ఔట్ పోస్ట్‌పై దాడిచేసి పలువురు సైనికులను హతమార్చారు. జమురాన్ షా డ్యామ్ ప్రాంతంలో ఐఈడీతో పాక్ ఆర్మీ వాహనాలను ధ్వంసం చేశారు. 'బలూచ్ వీరులు ఇప్పుడు నేరుగా పాక్ సైన్యంతో వీధుల్లో పోరాడుతున్నారు. ప్రజలు మాకు సంపూర్ణ మద్దతు పలుకుతున్నారు. మాకు వైమానిక దళ మద్దతు అవసరం' అని వేర్పాటువాదులు ఒక ప్రకటనలో వెల్లడించారు. బుధవారం బీఎల్ఏ సహా మూడు వేర్పాటువాద గ్రూప్‌లు డేరాబుగ్టి ప్రాంతంలోని పాక్ ప్రభుత్వానికి చెందిన గ్యాస్ పైప్‌లైన్లపై, సరఫరా వాహనాలపై, సరఫరా మార్గాలపై దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రాంతంలో దాదాపు 100 బావులు ఉన్నాయని, పాకిస్థాన్ పెట్రోలియం లిమిటెడ్ ఇక్కడ గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నదని వెల్లడించారు.

ప్రత్యేక దేశంగా గుర్తించండి..

బలూచిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో స్థానికులు, వేర్పాటువాదులు పాకిస్థాన్ జెండాలను తొలగించి బలూచిస్థాన్ జెండాలను ఎగురవేశారు. ఈ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బలూచిస్థాన్‌ను ప్రత్యేక దేశంగా గుర్తించాలని వేర్పాటువాదులు విజ్ఞప్తి చేశారు. 'మేం స్వాతంత్ర్యం పొందాం. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్థాన్‌ను ఐక్యరాజ్యసమితి ప్రత్యేక దేశంగా గుర్తించాలి. వెంటనే సభ్యదేశాలతో సమావేశం నిర్వహించి మద్దతు కోరాలి' అని ప్రకటనలో కోరారు. దేశ భద్రత ఏర్పాట్లకు, అధికారిక పత్రాల తయారీ, పౌరులకు గుర్తింపు కార్డుల జారీకి ఆర్థిక సాయం చేయాలని విన్నవించారు. ఐక్యరాజ్యసమితి శాంతి దళాన్ని తమ ప్రాంతానికి పంపాలని, పాకిస్థాన్ సైన్యం ఆయుధాలను ఇక్కడే వదిలేసి వైదొలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. బలూచిస్థాన్‌లో మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, క్యాబినెట్‌ను ప్రకటిస్తామని తెలిపారు. త్వరలోనే దేశ అవతరణ వేడుకలు నిర్వహిస్తామని, దీనికి మిత్ర దేశాలను ఆహ్వానిస్తామని చెప్పారు. భవిష్యత్తులో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వంలో మహిళలకు భాగస్వామ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. 'బలూచిస్థాన్ ప్రజలు పాక్ జెండాలను తొలగించి, సొంత జెండాలను ఎగురవేయడం మొదలు పెట్టారు. ప్రపంచ దేశాలు పాకిస్థాన్‌లోని తమ దౌత్య కార్యాలయాలను బలూచిస్థాన్‌కు తరలించాల్సిన సమయం వచ్చింది. పాకిస్థాన్‌కు వీడ్కోలు.. బలూచిస్థాన్‌కు స్వాగతం' అని బలూచ్ రచయిత మిర్ యార్ బలూచ్ గురువారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బలూచిస్థాన్‌కు 'ఉగ్రవాద దేశమైన పాకిస్థాన్ కుప్పకూలిన వార్త అతి త్వరలోనే వస్తుంది. మేము బలూచిస్థాన్‌కు స్వాతంత్ర్యం ప్రకటించుకుంటున్నాం. ఢిల్లీలో కొత్తగా బలూచిస్థాన్ దౌత్య కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి భారత్ అనుమతించాలని కోరుతున్నాం' అని విజ్ఞప్తి చేశారు.

ఇది ఫేజ్-1 మాత్రమే!

- **దాడిపై ఎదురుదాడికి మన సైన్యం సిద్ధం**
- **దొంగ దెబ్బ తీయడమే పాక్ పని**
- **'నమస్తే తెలంగాణ'తో విశ్రాంత మేజర్ ఎస్పీఎస్ ఒబెరాయ్**

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ): "భారతదేశానికి జరిగిన అన్యాయంపై తిరుగుబాటు మొదలైంది. బుధవారం జరిగిన ఆపరేషన్ సిందూర్ ఫేజ్-1 మాత్రమే. ఇలాంటివి ఇంకా రాబోతున్నాయి. బహుశా ఈ యుద్ధం రెండు మూడేండ్లపాటు జరిగినా ఆశ్చర్యపోనక్కర లేదు" అని విశ్రాంత మేజర్ ఎస్పీఎస్ ఒబెరాయ్ తెలిపారు. సర్జికల్ స్ట్రైక్ లాంటి ఘటనలు గతంలో జరిగినా ఈ స్థాయిలో జరగలేదని, పాకిస్థాన్ ఉగ్రవాదుల అరాచకాలకు బదులిచ్చేందుకు సమయం వచ్చిందని తెలిపేందుకే 'ఆపరేషన్ సిందూర్' అని ఆయన చెప్పారు. పదకొండేళ్లపాటు భారతసైన్యంలో దేశ సరిహద్దుల్లో సేవలందించిన విశ్రాంత ఎస్పీఎస్ ఒబెరాయ్ 'నమస్తే తెలంగాణ'తో ఇంటర్వ్యూలో కీలక అంశాలపై మాట్లాడారు.

కార్గిల్ స్ఫూర్తితో సైన్యంలో చేరాను

కార్గిల్ యుద్ధం చూసి చలించిపోయాను. ఆ స్ఫూర్తితోనే డిగ్రీ చేస్తున్నప్పుడు ఎన్‌సీసీలో చేరాను. దేశవ్యాప్తంగా 32 మంది ఎన్‌సీసీ వాళ్లను ఎంపికచేసి, 28 రోజుల పాటు ఆర్మీ తరహాలో శిక్షణ ఇచ్చారు. అందులో నేను సెలెక్ట్ అయ్యాను. 2004 నుంచి పదకొండేళ్లపాటు రాజస్థాన్, జమ్ముకశ్మీర్, అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం ప్రాంతాల్లోని సరిహద్దుల్లో పనిచేశాను. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులను రూపుమాపడంలో, ఊల్ఫా ఉగ్రవాదులను నిర్మూలించడంలో కీలకంగా పనిచేశాను.

చిన్నారులు, మహిళలకు ప్రాణహాని చేయలే

భారత సైన్యం, మయన్మార్ సైన్యంతో కలిసి ఓ పెద్ద ఆపరేషన్ నిర్వహించాం. ఆ ఆపరేషన్‌లో నేను గ్రౌండ్ లెవల్‌లో టీమ్ లీడ్ చేశాను. రెండు నెలలపాటు ప్రణాళికలు రచించి నిర్వహించిన ఆపరేషన్ సన్‌రైజ్-1, ఆపరేషన్ సన్‌రైజ్-2లో 66 మంది ఊల్ఫా ఉగ్రవాదులను హతమార్చాం. నేను అస్సాంలో పనిచేస్తున్న సందర్భంలో ఊల్ఫా ఉగ్రవాదులు ఓ ఇంట్లో ఉన్నారని సమాచారం రావడంతో దాడి చేసేందుకు వెళ్లాం. అక్కడున్న చిన్న పిల్లలకు, మహిళలకు ఎలాంటి హాని కలిగించకుండా 8 గంటలపాటు వేచి చూసి మరీ ఉగ్రవాదులపై దాడి చేశాం. నేను ఓ చిన్నగదిలో ఉంటే దాని గోడలన్నీ బుల్లెట్ మరకలతోనిండేవి. జమ్ముకశ్మీర్‌లో ఒకసారి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. అస్సాంలో మేం వెళ్తున్న దారిలో కాపుకాచి ఉగ్రవాదులు దాడికి దిగారు. వాళ్ల నుంచి తప్పించుకొని ఓ కాలువలో చాలా సేపు తలదాచుకున్నాం. రెండు రోజుల తర్వాత పక్కా ప్రణాళికతో వారిని హతమార్చాం.

గర్వంగా ఫీలయ్యాను

సైనికుల జీవితాలు సాధారణ ప్రజల మాదిరిగా ఉండవు. ఇరవైనాలుగు గంటలు పని చేస్తునే ఉంటాం. నాతోటి సహచరులు ఉగ్రదాడిలో మరణించినప్పుడు ఎంతగానో బాధపడ్డాను. తిరిగి ముష్కరులపై దాడి చేసేందుకు ప్రణాళిలు రచిస్తూనే ఉంటాం. మరోవైపు చనిపోయిన జవాన్‌ను ఇంటికి చేర్చడంలోనూ బాధ్యతగా విధులు నిర్వహిస్తాం. నా యూనిట్‌లోని ముగ్గురు జవాన్‌లు ఉగ్రదాడిలో మరణించినప్పుడు మృతదేహాలను ఇంటికి చేర్చే బాధ్యత మా కమాండర్ నాకు అప్పగించారు. వారి స్వగ్రామాల్లో ప్రజలంతా ఒక్కటిగా కలిసి నివాళులర్పిస్తూ, అంతిమయాత్రలో పాల్గొనటం చూసి ఎంతోగర్వంగా ఉప్పొంగాను.

ఉగ్రవాదం మూలాలపై కొట్టాలి!

- **అంతర్జాతీయ మార్కెట్‌లో పాకిస్థాన్ ఏకాకి**
- **పాకిస్థాన్‌కు చైనా సాయం ఉండకపోవచ్చు**
- **'నమస్తే తెలంగాణ'తో యూఎన్ శాశ్వత ప్రతినిధి ఏలూరి శ్రీనివాసరావు ఇంటర్వ్యూ**

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): మారణహోమం ఏదైనా అందరూ ముక్తకంఠంతో ఖండించాల్సిందేనని ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక మండలి శాశ్వత సభ్యుడు, తెలంగాణ వాసి ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఇస్లామిక్ టెర్రరిజం ప్రపంచాన్ని గడగడలాడిస్తున్నదని చెప్పారు. ఆ ఉగ్రమూలాలను పూర్తిగా నాశనం చేసేలా దెబ్బకొట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు. మతం పేరిట జరిగే అరాచకాలను ఉపేక్షించకూడదని చెప్పున్న ఏలూరి శ్రీనివాసరావుతో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూ.

భారత్-పాక్ మధ్య యుద్ధవాతావరణం మొదలైంది. అంతర్జాతీయంగా ఎలాంటి ప్రభావం ఉంటుంది?

ఇస్లామిక్ టెర్రరిజంతో ప్రపంచంలోని చాలా దేశాలు ఇబ్బందులు పడుతున్నాయి. అమెరికా, శ్రీలంక, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్, చైనా, ఇండియా, ఇజ్రాయెల్, ఇరాన్, ఇరాక్, టర్కీ, ఆఫ్రికా వంటి చాలా దేశాలు ఉగ్రవాదానికి బాధిత దేశాలే.

ఉగ్రవాదాన్ని పూర్తిగా అంతరించేందుకు ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

పాకిస్థాన్‌కు విదేశీ ఫండింగ్‌ను నిలిపివేయాలి. పాక్ ఉగ్రవాదాన్ని వదిలేసేలా అంతర్జాతీయ సంస్థలు హెచ్చరించాలి. అక్కడి ప్రభుత్వం పటిష్టంగా, ప్రజాస్వామ్యయుతంగా ఉండాలి. టర్కీ నుంచి ఉగ్రవాదాన్ని వదిలించిన ముస్తఫా కెమాల్ వంటి సంస్కర్త రావాలి. ప్రజలకు విద్యావకాశాలు కల్పించాలి. మెరుగైన వసతుల కల్పనకు ఏర్పాట్లు చేయాలి.

ఉగ్రవాదులకు కశ్మీర్‌లోని కొందరు స్థానికుల మద్దతు ఉందనేది నిజమేనంటారా?

అందులో వాస్తవం ఉంది. చాలామంది కశ్మీరీలు తాము ఇండియన్స్ అని చెప్పుకోరు. కశ్మీరీలు అని చెప్పుకుంటారు. అలాగని అందరూ ఉగ్రవాదులు కాదు. వారిలో కొందరు పాకిస్థాన్ ఉగ్రవాదులకు మద్దతు తెలపడం వల్లే అక్కడక్కడా దాడులు జరుగుతున్నాయి. జమ్ముకశ్మీర్ యువతకు ఉపాధి కల్పనకు, పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. అక్కడ పౌరులను రెచ్చగొట్టే ఇస్లామిక్ సభలను నిషేధించాలి. రెచ్చగొట్టే ఉపన్యాలపై నిఘాపెట్టాలి. ఉగ్రవాదం పట్ల సానుభూతి కలిగిన వారికి భారతీయ సంస్కృతిని అలవాటు చేయాలి. ఫలితంగా ఉగ్రవాదులకు స్థానికంగా మద్దతు తెలిపే వారి సంఖ్య క్రమంగా తగ్గుతుంది.

ఒకవేళ యుద్ధం సంభవిస్తే.. ఏయే దేశాలు ఎవరికి అండగా నిలిచే అవకాశాలున్నాయి?

తమ దేశాల్లో చాపకింద నీరులా విస్తరిస్తున్న ఇస్లామిక్ టెర్రరిజాన్ని అంతం చేయాలనుకుంటున్న దేశాలన్నీ ఒకటిగా నిలుస్తాయి. చైనాను కూడా ఈ ఉగ్రవాదం వణికించింది. దీంతో ముష్కరులందరినీ ఆ దేశం ఒకేసారి చంపేసింది. ప్రపంచంల